క్లుప్తంగా

మండల ఉపాధ్యాయుడికి సత్కారం



సన్మానం అందుకుంటున్న మహ్మద్‌అలీ

వి.కోట: స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉర్దూ గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మహ్మద్‌అలీ సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రభుత్వం నుంచి సత్కారం అందుకున్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆయన్ను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన్ను సన్మానించారు. పలువురు టీచర్లు అయన్ను అభినందించారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

కుప్పం: భగవద్గీత కంఠస్థ పోటీలు డిసెంబర్ 11న శ్రీ సుజ్ఞానంద ఆశ్రమంలో నిర్వహించనున్నామని ట్రస్టు సభ్యులు వెంకటాచలపతి గుప్తా, శివ తెలిపారు. గీతా జయంతి పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించనున్నామని, వీటిలో పాల్గొనదలచిన వారు డిసెంబర్ 5వ తేదీలోపు పేర్లు, ఫోన్ నంబర్లు నమోదు చేసుకోవాలన్నారు. 14 ఏళ్లలోపు వారికి భగవద్గీత 12వ అధ్యాయం భక్తి యోగంపై కంఠస్థ పోటీలు ఉంటాయని, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలకు రూ3116, రూ.2116, రూ.1116 ఇస్తామన్నారు. అలాగే 15 ఏళ్ల పైబడిన వారికి 13వ అధ్యాయం నుంచి 18 అధ్యాయం వరుకు కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5116, రూ.2516, రూ.1116 ఇవ్వనున్నట్టు చెప్పారు. అలాగే 'భగవద్గీత జీవనయాత్ర మార్గదర్శి' అనే అంశంపై వక్తృత్వ పోటీ నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు 8978812579, 944046666, 9391833555 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పుంగనూరు: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలపై విద్యుత్ చార్జీలతో షాక్ ఇచ్చిందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు అహమ్మద్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. బిల్లులు తగ్గించాలని, ప్రజలను ఆదుకోవాలని నినదించారు. అనంతరం ఏడీ శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు.

పేద విద్యార్థులకు పరీక్షల ఫీజు విరాళం



విరాళం అందజేస్తున్న మహేష్

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల ఫీజును కల్లూరుకు చెందిన మాచారం మహేష్ రూ.10వేలను విరాళంగా హెచ్ఎం శ్రీవాణికి అందజేశారు. దాతల సహకారం మరువలేనిదని, విద్యార్థులు దాతల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనపర్తి సిద్ధులు, రాజేంద్ర, ప్రకాష్, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



మౌలానా సేవలను విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకులు

బంగారుపాళెం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి అన్నారు. కళాశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. స్వతంత్ర భారత మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా సయ్యద్ అబుల్ కలాం గులాం మొహియుద్దీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, స్వాతంత్ర్యానంతరం మౌలానా సయ్యద్ కలాం విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కీర్తించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మురళి మాట్లాడుతూ, దేశంలో విద్యావ్యవస్థ పటిష్టతకు, విశ్వవిద్యాలయ స్థాపనకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి మౌలానా అని అన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కళాశాలల్లో అందిస్తున్న ఉచిత విద్య, వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

● పలమనేరులో కలపాసురులు

వృక్ష సంహారం



పలమనేరు నియోజకర్గంలో నేలకూలుతున్న వృక్షాలు(ఫైల్)

పలమనేరు నియోజకవర్గంలో కొందరు అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా పచ్చటి వృక్షాలను నేల కూల్చి సామిల్లులకు అక్రమ రవాణా చేస్తున్నారు. మరి కొందరు ఇటుక బట్టీలను కాల్చేందుకు వీటిని విక్రయిస్తున్నారు. ఈ వ్యాపారంలో నియోజకవర్గంలోనే నలుగురు స్మగర్లు డాన్‌లుగా చలామణి అవుతున్నారు. మరో నలభైమంది ఆయా ప్రాంతాల్లోని చింత, వేప తదితర వృక్షాలను నరకడమే పనిగా పెట్టుకున్నారు. ఆధునిక కట్టర్లు రావడంతో పెద్ద వృక్షాలను సైతం నిమిషాల్లో నేలకూల్చి, కొమ్మలను కోసి, గంట వ్యవధిలోనే ట్రాక్టర్లలో పట్టపగలే తరలిస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రభుత్వభూములు, ఆలయ మాన్యాల్లోని వృక్షాలను సైతం వదలడం లేదు. వాల్టా చట్టాన్ని అమలు చేయాల్సిన అటవీ, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

- స్మగ్లర్ల ధాటికి నేలకూలుతున్న పలు వృక్షాలు
- అక్రమంగా సామిల్లులకు, ఇటుక బట్టీలకు చేరిక
- యథేచ్ఛగా కలప అక్రమ రవాణా
- వాల్టా చట్టాన్ని పట్టించుకోని అధికారులు
- నియోజకవర్గంలో 40మంది వరకూ 'కలపాసురులు'

పలమనేరు: నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములు, పోరంబోకులతో పాటు రైతుల పొలాల్లో వృక్షాలు భారీగా ఉన్నాయి. డిసెంబర్ నుంచి మే నెల వరకూ ఈ ప్రాంతంలో ఇటుక బట్టీల సీజన్ సాగుతోంది. బట్టీల్లో ఇటుకలను కాల్చేందుకు కలపనే ఇక్కడ ప్రధానంగా వినియోగిస్తున్నారు. దీంతో కలపను ముందుగానే కొని ఎండబెట్టుకోవాలి. ఫలితంగా స్థానికంగా చెట్లకు మంచి డిమాండ్ ఉంది. దీనికి తోడు మండల కేంద్రాల్లోని సామిల్లులు సీజన్‌తో సంబంధం లేకుండా కలపను కొంటున్నాయి. డిమాండ్ దృష్ట్యా కొందరు కలప వ్యాపారమే వృత్తిగా చేసుకున్నారు. చెట్లను గుట్టుగా నరకడం, వాటిని దాచి రేయింబవళ్లు తేడాలేకుండా తరలిస్తున్నారు. నియోజకవర్గంలో దాదాపు 40మంది ఇదే వ్యాపారాన్ని సాగిస్తున్నారు. వీరిలో నలుగురు ఆయా మండలాల్లో చెట్లను కొట్టి వ్యాపారం చేసే డాన్‌లుగా మారారు. పలమనేరు మండలంలో కొలమాసనపల్లె పంచాయతీకి చెందిన ఓ యువకుడు వృక్షాల అక్రమ రవాణాలో కలపాసురుడయ్యాడు.

వాల్టా..ఉల్టా

చెట్లను నరకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏపీ వాల్టా యాక్టు 2002 (ఆంధ్రప్రదేశ్ వాటర్,ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్టు)ను అమలు చేస్తోంది. దీని ప్రకారం ఎవరైనా రైతులు పట్టా భూముల్లోని చెట్లను నరకాలన్నా రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. నరికిన చెట్ల స్థానంలో అంతకు మించి మొక్కలను నాటాల్సి ఉంది. అయితే సంబంధిత రెవెన్యూ గ్రామాల పరిధిలోని వీఆర్వోలు దీని గురించి పట్టించుకోవడం లేదు. అసలు వాల్టా చట్టం అమలు తమ బాధ్యత అనేది కూడా వారికి తెలుసో తెలియదో కూడా అనుమానం అనే రీతిలో వారి వ్యవహార శైలి ఉంటోంది. ఇక ఫారెస్ట్ అధికారులు సేమ్ టు సేమ్. ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు. తీసుకుందామన్నా అక్రమార్కులకు అక్కడి నేతల అండదండలున్నాయనే మాట వినిపిస్తోంది. దీంతో విలువైన వృక్ష సంపద కనుమరుగవుతోంది.



సా మిల్లులకు ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప (ఫైల్)



ఇటుకబట్టీ కోసం నరికివేసిన భారీ వృక్షం

నియోజకవర్గంలో ఇటుక బట్టీల సమాచారం

మొత్తం ఇటుక బట్టీలు(సీజన్‌లో)	300 దాకా
బట్టీకి అవసరమైన కలప	ఏడు ట్రాక్టర్ లోడ్లు (ట్రాక్టర్‌కు 5 టన్నుల చొప్పున 35 టన్నులు)
ప్రస్తుతం టన్ను కలప ధర	రూ. 16వేలు(కట్ చేసిన కూలితో కలిపి)
సీజన్‌లో కాలి బూడిదవుతున్న కలప	12,600 టన్నులు
సామిల్లులకు తరలుతున్న కలప నెలకు	50 ట్రాక్టర్లు

పార్టీ అధినేతను కలిసిన ఎమ్మెల్సీ భరత్



కుప్పం రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కుప్పం ఇన్‌చార్జి ఎమ్మెల్సీ భరత్ సోమవారం విజయవాడలోని తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. కుప్పంలో పార్టీ పరిస్థితిని ఆయనకు వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా బనాయిస్తున్న అక్రమ కేసులు, పెడుతున్న ఒత్తిళ్ల గురించి తెలియజేశారు. ఎవరూ అధైర్య పడరాదని, తాను అండగా ఉంటానంటూ పార్టీ అధినేత భరోసా ఇచ్చారు.

కార్తీక మాసంలో ప్రత్యేక బస్సులు

కుప్పం: కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతి సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేకంగా కుప్పం నుంచి ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ గోపినాథ్ తెలిపారు. 18, 25వ తేదీల్లో కుప్పం నుంచి మల్లప్పకొండ, కోటిలింగాలు, బంగారు తిరుపతి, ఆవని, కురుడుమలై, ముళబాగల్, మొగిలికి బస్సులు నడపనున్నట్టు ఆయన తెలిపారు. ఈ యాత్రకు టిక్కెట్ చార్జీ పెద్దలకు రూ.500. పిల్లలకు రూ.300గా నిర్ణయించినట్టు చెప్పారు. ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని, దీనికి అదనపు చార్జీలు వర్తిస్తాయన్నారు. దీనిని కుప్పం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం 9959225681,7382275002 సెల్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

నాణ్యమైన విద్య అందించండి

● జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



పాఠశాల గదులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించడంతోపాటు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని పెట్టాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని పత్రపల్లె ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదులు, రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను వంట గది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు.నాణ్యమైన విద్య, నాణ్యమైన భోజనం అందుతోందా? పాఠాలు బాగా అర్థమవుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే విద్యార్థులు నిర్భయంగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఏపీఓగా చిన్న రెడ్డెమ్మ



చౌడేపల్లె: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓగా చిన్నరెడ్డెమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె పెద్దపంజాణి మండలం నుంచి బదిలీపై చౌడేపల్లెకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్ యాదవ్ గంగవరానికి బదిలీ అయ్యారు. ఆమె మాట్లాడుతూ, మండలంలో కూలీలందరికీ పనులు కల్పించి సుస్థిర ఆస్తుల కల్పనతోపాటు ఆర్థిక జీవనోపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జాబ్‌మేళాలో 30మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల అధ్యాపక బృందం

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో కళాశాలలోని డీఏహెచ్ (డిప్లమో ఇన్ అనిమల్ హస్బెండరీ) కోర్సుకు చెందిన 30మంది శ్రీజ డెయిరీలో ఉద్యోగాలు పొందారు. శ్రీజ డెయిరీ మేనేజర్ రవికుమార్‌కు కళాశాల అధ్యాపక బృందం కృతజ్ఞతలను తెలిపింది. బ్యాచులర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఎక్కువగా ఉద్యోగాలు రావడం ఆనందంగా ఉందని వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఒకేషనల్ కోర్సు కో–ఆర్డినేటర్ డాక్టర్ రవీంద్రారెడ్డి, క్లాస్ ఇన్‌చార్జి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పీఓ అమరజ్యోతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ, మండలంలోని జువ్వలదిన్నితాండలో కార్యకర్త, పట్టణంలోని రాంనగర్‌కాలనీలో సహాయకురాలి పోస్టు, అలాగే సోమల మండలం ముండ్రివారిపల్లెలో సహాయకురాలి ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేయాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆయా పోస్టుకు..

రొంపిచెర్ల: ఖాళీగా ఉన్న బోడిపాటివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష కోరారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు.ఇక్కడ ఆయాగా పని చేస్తున్న అనిత ఉద్యోగానికి 6 నెలల క్రితం రాజీనామా చేశారని తెలిపారు. దీంతో పీడీ ఆ పోస్టు భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. ఆయా పోస్టును ఓసీలకు కేటాయించామని, పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి 21–35 ఏళ్లలోపు ఉన్న అంగన్‌వాడీ పరిధిలోని మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ లోపు ఇవ్వాలని తెలియజేశారు.

కుప్పం మండలంలో..

కుప్పం రూరల్: కుప్పం మండలంలోని గణేష్‌పురం అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా నివాసం ఉండి, 10వ తరగతి ఉత్తీర్ణురాలైన మహిళను రోస్టర్ పద్ధతిలో నియమించనున్నట్టు తెలియజేశారు. 13వ తేదీ నుంచి కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చని, వాటిని పూరించి 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కుప్పంలోని తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

అతిథి అధ్యాపక పోస్టులకు...

కుప్పం మండలంలోని మల్లానూరు జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సివిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించి అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ చౌదరి తెలిపారు. అభ్యర్థులు పీజీలో ఆయా సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులు సాధించి ఉండాలని, పూర్తి వివరాలకు కళాశాల పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు.

మౌలానా సేవలు శ్లాఘనీయం





మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, ఆజాద్ జయంతి నిర్వహిస్తున్న డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి

పలమనేరు: దేశంలోని విద్యావిధానంలో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ సేవలు శ్లాఘనీయమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం స్మరించారు. అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక కళాశాలలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి నేషనల్ ఎడ్యుకేషన్ డే సోమవారం నిర్వహించారు. విద్యారంగంలో మౌలానా చేసిన సేవలను ప్రస్తుతించారు. విద్యతోపాటు వృత్తిపరమైన శిక్షణతోనే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఆయన ఆనాడే భావించి ఈ విధానాన్ని అమలు చేసేలా చూశారన్నారు. కార్యక్రమంలో పలు వురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆజాద్ జయంతి వేడుకలు

పుంగనూరు: భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమిలో డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన విద్యాభివృద్ధికి చేసిన సేవలను స్మరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిని, జలజ, యేసునాథ్, శివశంకర్, షాహినా, సత్య, వనజ, రెడ్డెమ్మ, అర్చన, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

యూత్ ఫెస్టివల్‌లో కుప్పం విద్యార్థుల ప్రతిభ



బహుమతులు గెలుపొందిన వారితో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు



గంగవరం: విజేతలను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్

కుప్పం రూరల్: ఎస్వీ యూనివర్సిటీలో 8, 9, 10వ తేదీల్లో జరిగిన అంతర కళాశాలల యూత్ ఫెస్టివల్‌లో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని కళాశాల వైస్ చైర్మన్ సాగర్‌రాజ్ తెలిపారు. కళాశాల నుంచి 24 మంది ఫెస్టివల్‌లో పాల్గొన్నారని, బీకాం (సీఏ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న చరణ్ మిమిక్రీ, బీసీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఆది చరణ్ ఫొటోగ్రఫీ పోటీల్లో తృతీయ బహుమతులు సాధించినట్లు ఆయన చెప్పారు.

ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు..

గంగవరం: ఎస్వీ యూనివర్సిటీ తిరుపతిలో నిర్వహించిన అంతర కళాశాలల యూత్ ఫెస్టివల్ పోటీలలో మండలంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని చైర్మన్ ఎంవీఆర్ రెడ్డి సోమవారం తెలిపారు. ఆన్ ది స్పాట్ ఇన్‌స్టలేషన్‌లో యూనివర్సిటీ మొదటి బహుమతి, రంగోలిలో ద్వితీయ బహుమతి, పెయింటింగ్ విభాగంలో తృతీయ బహుమతిని తమ విద్యార్థులు సాధించారని ఆయన తెలిపారు. విజేతలను కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీసుధ, అధ్యాపకులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వరి వ్రతం





పెద్దపంజాణి: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో వ్రతమాచరిస్తున్న మహిళలు, పుంగనూరు: భోగనంజుండేశ్వరిస్వామి ఆలయంలో..

చౌడేపల్లె: మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో కేదారేశ్వరి స్వామి వ్రతమాచరించారు. కార్తీక మాసపు సోమవారంతోపాటు ఏకాదశి సందర్భంగా స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, గాండ్లపల్లె వీరాంజనేయస్వామి తదితర ఆలయాల్లో మహిళలు వేదపండితులు రాజశేఖర దీక్షితులు, మహేష్, ఆనందాచార్యుల ఆధ్వర్యంలో తొలుత వ్రత పూజలు చేశారు. వ్రత మహత్యాన్ని భక్తులకు వేద పండితులు వివరించారు. అలాగే శివాలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేక పూజలు చేశారు. ఆలయంలో మహిళలు ధ్వజ స్తంభం ఎదుట దీపారాధన చేశారు.

సదుంలో..

సదుం: కార్తీక సోమవారం పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎర్రాతివారిపల్లె నాగమల్లేశ్వరస్వామి, మండల కేంద్రంలోని వీరభద్ర, మరకతేశ్వర స్వామి, అరుణాచలేశ్వరస్వామి, మత్తుకువారిపల్లె సమీపంలోని మల్లేశ్వరస్వామి ఆలయాలలో పూజలు, అభిషేకాలు చేశారు. పలు ఆలయాలలో సామూహిక కేదారేశ్వర స్వామి వ్రతమాచరించారు. నిర్వహించారు.

పుంగనూరులో..

పుంగనూరు: ఏకాదశి సందర్భంగా పట్టణంలోని శ్రీభోగనంజుండేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కేదారేశ్వరినోములు ఆచరించారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరై అమ్మవారికి పూజలు చేసి, నైవేద్యం సమర్పించి, గౌరీదేవి వ్రత కల్పాన్ని చదివారు. నోముదారాలు కట్టుకుని మొక్కులు చెల్లించారు.



చౌడేపల్లె: మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం వద్ద వ్రత పూజలు చేస్తున్న మహిళలు

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని చెన్నారెడ్డిపల్లె చెరువు కట్టపై ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి, రాయలపేటలోని బసవేశ్వరస్వామి ఆలయాలలో సోమవారం కేదార గౌరీ వ్రతాన్ని భక్తిప్రపత్తులతో ఆచరించారు. అలయంలోని పార్వతీ పరమేశ్వరులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అర్చకులు హరీష్ ఆలయంలో గౌరీదేవిని ప్రతిష్ఠించి కేదారగౌరి ప్రాశస్త్యం, వ్రతవిధానాన్ని వివరించారు. పెద్ద ఎత్తున మహిళలు ఆలయంలో నోములు నోచి మొక్కులు చెల్లించారు.నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



వి.కోట: దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వి.కోటలో..

వి.కోట: స్థానిక ఈశ్వర్‌నగర్‌లోని శ్రీ కాశీవిశ్వేరస్వామి ఆలయం, దాసార్లపల్లెలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ఆలయ అర్చకులుఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, రకరకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు స్వామి వారికి దీపారాధన చేసి 350 వత్తులు వేసి, పిండి దీపాలను వెలిగించి, మొక్కులు చెల్లించారు.

డేంజర్.. డేంజర్..! ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ప్రమాదకరంగా పెట్టిన ట్రాన్స్‌ఫార్మర్

పుంగనూరు: పట్టణంలోని ఉలదిన్ని క్రాస్ వద్ద జాతీయ రహదారిపై ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఎలాంటి దిమ్మెలు కట్టకుండా, రక్షణ కంచె వేయకుండా రోడ్డుపైనే బండరాయిని పెట్టి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో ప్రమాదాలకు తావిచ్చేలా ఉంటోందని జాతీయ రహదారిపై వచ్చే వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏమరుపాటున వాహనాలు తగిలితే ప్రమాదాలు తప్పవని, అధికారులు ఇకనైనా రక్షణ కంచె ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

చిత్తూరు కలెక్టరేట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. ఆ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడంలో ముందుండాలన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి రక్తదానం చేయడం ఆరోగ్యానికి మంచిదన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్న అపోహలను నమ్మకూడదని చెప్పారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షమ్స్ అక్తర్ మాట్లాడుతూ, తమ కళాశాలలోని 25 మంది బాలికలు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ అధ్యక్షులు సహదేవ నాయుడు, డాక్టర్ విజయకుమార్, వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర, రెడ్ క్రాస్ కో–ఆర్డినేటర్ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.